ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY

నల్లగొండ
5
బుధవారం 31 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ :18004251442
యాదాద్రి :1800 425 7106
సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.131	190	216
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 18.0

జిల్లా కేంద్రం నల్లగొండలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం కేటాయించిన నిధులు ఎన్ని, ఖర్చు ఎంత అనే దానిపై స్పష్టత కరువైంది. గత ప్రభుత్వం నల్లగొండకు రూ.1350కోట్లు కేటాయించామని చెబుతుండగా, అవి ఉత్తి మాటలనేనని రూ.700కోట్ల నుంచి రూ.800కోట్లకు మించి విడుదల కాలేదని ప్రస్తుత పాలకులు చెబుతున్నారు.

● నల్లగొండ/రామగిరి


ఐటీ టవర్

నీలగిరికి వచ్చిందెంత? ఖర్చెంత?

- ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ప్రారంభంకాని కార్యకలాపాలు
- మినీట్యాంక్‌బండ్ నిర్మాణంపై నీలినీడలు
- గడియారం సెంటర్‌లో కళాభారతిపై స్పష్టత కరువు
- ఐటీ హబ్‌కు వచ్చింది ఐదు కంపెనీలే
- పూర్తికాని అభివృద్ధి పనులు

నల్లగొండ/రామగిరి, జనవరి 30: జిల్లా కేంద్రమైన నల్లగొండలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం కేటాయించిన నిధులు, ఖర్చుపై స్పష్టత కరువైంది. నల్లగొండలో హైదరాబాద్ రోడ్డు నిర్మాణ పనులతో పాటు వివిధ జంక్షన్ల పనులు ప్రారంభమై ఎన్నికల కోడ్ కారణంగా నిలిచి, నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నల్లగొండ అభివృద్ధి పనులపై నిర్ణయాలు తీసుకునే విషయంలో గందరగోళం నెలకొంది. గత సీఎం కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకొని పట్టణ అభివృద్ధికి రూ.1350కోట్లు కేటాయించారని బీఆర్ఎస్ నాయకులు చెబుతుండగా, అదంతా ఉట్టిదేనని, నిధులు మాటలకే పరిమితమని, రూ.700కోట్ల నుంచి రూ.800కోట్లకు మించి విడుదల కాలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నల్లగొండ మునిసిపల్ కమిషనర్ రమణాచారి రాజీనామా చేశారు. దీంతో టెండర్ల విషయం మొదలు, ఏ స్థాయిలో కాంట్రాక్టర్లు పనులు చేశారు, ఎక్కడ నిలిచాయి, ఏ మేరకు బిల్లులు చెల్లించారనేది శాఖల వారీగా పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ చెబుతున్న పనుల్లో ప్రధానమైనది పట్టణంలో రోడ్ల విస్తరణ. కాగా, హైదరాబాద్ రోడ్డు విస్తరణ నేటికీ పూర్తిస్థాయిలో పూర్తికాలేదు. ఇంకా ప్యాచ్‌వర్క్‌లతో పాటు ఇతర పనులు మిగిలే ఉన్నాయి. గడియారం సెంటర్‌లో ఆర్అండ్‌బీ, ఐబీ కార్యాలయ భవనాలను కూల్చి కళాభారతిని నిర్మించాలని తలపెట్టారు. అయితే ఇప్పటి వరకు కళాభారతి నిర్మాణంపై స్పష్టత లేకపోగా, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి ఉంది. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా ఉండగా, నల్లగొండలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతాయని అంతా భావిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పలు రోడ్లకు సుమారు రూ.100కోట్లతో టెండర్లు సైతం ఆహ్వానించేందుకు ఆదేశాలు జారీచేశారు.

అసంపూర్తిగా వల్లభరావు చెరువు పనులు

వల్లభరావుచెరువు (బతుకమ్మకుంట)ను మినిట్యాంక్‌బండ్‌గా మార్చాల్సిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గతంలో విడుదలైన నిధులు దుర్వినియోగం కావడంతో పాటు పనులు అర్ధాంతరంగా నిలిచాయి. మరోసారి నిధులు కేటాయించి చేపట్టిన పనులు సైతం నిలిచాయి. కేవలంలో సీసీ రోడ్డు నిర్మించి వదిలేశారు. చెరువు కట్ట ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. ఎంతో సుందరంగా రూపుదిద్దుకోవాల్సిన వల్లభరావు చెరువు మద్యం తాగే వారికి, గంజాయి తాగే వారికి నిలయంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. రాత్రి 8గంటలు దాటితే చెరువు కట్టపై నుంచి వెళ్లాలంటే ప్రజలు భయపడి ఇతర మార్గాల నుంచి పట్టణంలోకి వెళ్తున్నారు. ఇప్పటికైనా నిధుల విషయంపై స్పష్టత ఇచ్చి అభివృద్ధి పనులు వేగిరం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఐటీ హబ్‌లో ఐదు కంపెనీలు

ఐటీ హబ్‌కు 17కంపెనీలు వస్తాయని, తద్వారా సుమారు 3,500మందికి ఉద్యోగాలు వస్తాయని భావించగా, ఇప్పటి వరకు కేవలం ఐదు కంపెనీలే కార్యకలాపాలు ప్రారంభించాయి. వచ్చిన ఈ ఐదు కంపెనీల్లోనూ అరకొరగానే ఉద్యోగులు ఉన్నారు. గత ఏడాది సెప్టెంబరు 1వ తేదీన జాబ్‌మేళా నిర్వహించగా, మొత్తం కంపెనీలు హాజరయ్యాయి. ఆయా కంపెనీలకు చెందిన క్యూఆర్‌కోడ్‌లతో మొత్తం 3,250మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారికి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించగా 320మంది ఎంపిక కాగా, ఇంటర్వ్యూలో 45మందికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు ఇచ్చారు. ఎంతో మంది నిరుద్యోగులు ఐటీ హబ్‌పై ఆశలు పెట్టుకోగా, ఇంకా 12 కంపెనీలు పనులే ప్రారంభించలేదు. త్వరలోనే అవి ప్రారంభమవుతాయని నిర్వాహకులు చెబుతున్నారు. నిరుద్యోగులు వలసలు పోకుండా స్థానికంగానే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం గత ప్రభుత్వం నిధులు కేటాయించి ఐటీ హబ్ భవనాన్ని నిర్మించగా, కంపెనీలు ముందుకు వచ్చినా ఆశించిన స్థాయిలో మాత్రం ఉద్యోగాల కల్పన జరగలేదు.



కార్యకలాపాలకు నోచుకోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్



పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ను గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌గా మార్చింది. గతంలో ఉన్న మార్కెట్ షెడ్‌లలో రూ.8.50కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను చేపట్టారు. ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి కేటీఆర్ ఈ మార్కెట్ ప్రారంభించినా, వాటిని వ్యాపారులకు అప్పగించలేదు. ఇదే సమయంలో పలువురు ఇక్కడి దేవాలయం ఎదుట నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు చేయడంపై అభ్యంతరం తెలిపారు. అంతేగాక బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో పాటు నాటి భువనగిరి ఎంపీ, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాన్‌వెజ్ మార్కెట్ తొలగిస్తామని నాడు వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇటీవల సమీకృత మార్కెట్‌లో నాన్‌వెజ్ విభాగాన్ని తొలగించి ఫ్లవర్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిచందనకు ఆదేశాలు జారీ చేశారు. అయినా మార్కెట్‌లో కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. మరి నాన్‌వెజ్ మార్కెట్‌ను ఎక్కడికి తరలిస్తారనేది చూడాల్సి ఉంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నాన్‌వెజ్‌కు సంబంధించి 28మటన్ షాపులు, 14 చికెన్, 12 చేపల దుకాణాలను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. వాటిని ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. సమీకృత మార్కెట్‌లో నాన్‌వెజ్ మార్కెట్‌కు తగ్గట్టుగా చేసిన నిర్మాణాలను తొలగించాల్సి ఉండగా చేసిన ఖర్చు వృథా కానుంది. వెజ్ మార్కెట్‌లో 72దుకాణాలను సైతం ఇప్పటి వరకు వ్యాపారులకు కేటాయించలేదు. అదేవిధంగా ఎన్జీ కళాశాల ప్రహరీ వెంట హైదరాబాద్ రోడ్డులో చిరు వ్యాపారుల కోసం ఏర్పాటుచేసిన దుకాణాలను 36మందికి కేటాయించాల్సి ఉంది. స్థలాభావంతో ఇక్కడ 25 మంది మాత్రమే దుకాణాలను కొనుగోలు చేయగా, మిగిలిన 11మందికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించగా, నేటికీ కేటాయింపులు జరగలేదు.

ఇష్టారాజ్యం


నల్లగొండ నేతాజీ సర్కిల్ వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న ఆర్టీసీ బస్సు

- అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు
- ప్రధాన రహదారులపై పొంచి ఉన్న ప్రమాదం
- ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ కరువు
- దృష్టి సారించని పోలీస్, మునిసిపల్ యంత్రాంగం

నల్లగొండలో వేల కోట్ల రూపాయలతో ప్రధాన రోడ్ల అభివృద్ధి జరిగినా ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. రహదారుల విస్తరణతో వాహనాల వేగం పెరిగింది. వాటిని కట్టడి చేసేందుకు ఏర్పాట్లు చేయకపోవడంతో రోజుకో ప్రమాదం చోటుచేసుకుంటోంది. ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడంతో చిన్నా పెద్ద వాహనాలు రయ్..రయ్‌మంటూ వెళ్తున్నాయి. రోడ్ల వెడల్పు పెరగడంతో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించడంలేదు. రాంగ్ రూట్లో వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో పలువురు మృత్యువాత పడటంతో పాటు చాలా మంది గాయాలపాలై క్షతగాత్రులుగా మారుతున్నారు.

రోడ్డు పనులు చేపడుతు న్న సందర్భంలో పట్టణంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను నిలిపివేశా రు. పనులు పూర్తయిన తర్వాత వాటిని పునరుద్ధరించకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని పలువురు పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సరైన ఏర్పాట్లు కూడా చేయకపోవడం మరో కారణంగా చెబుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్ రోడ్డు నుంచి గడియారం సెంటర్ వరకు ఈ 5 నెలల కాలంలో వం దల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి.కొందరు మృతి చెంద గా మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు.అభివృద్ధికోసం వేలకోట్లు ఖర్చు చేసిన అధికారులు,పాలకులు కనీసం ట్రాఫిక్ సిగ్న ల్ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

- హైదరాబాద్ రోడ్డులో గల నిఖిల్ ఫంక్షన్ హాల్ ఎదురు గల్లీ నుంచి ఓ కారు వచ్చి మళ్లే క్రమంలో హైదరాబాదు రోడ్డు నుంచి నల్లగొండకు వస్తున్న ఓ కూరగాయల వాహన డ్రైవర్‌కు మలుపు తిరుగుతున్న కారు కనిపించకపోవడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రోడ్డు పక్కనే నిలబడి ఉన్న గిరికబాయిగూడెంకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు.
- నెల రోజుల క్రితం ప్రసాద్ ఉడిపి హోటల్ ఎదురుగా ఓ మొబైల్ షాపు యజమాని రోడ్డు దాటుతుండగా ఇది గమనించని ఓ వాహనాదారుడు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడిక్కడే మృతి మృత్యువాత పడ్డాడు.
- 20 రోజుల క్రితం వీటికాలనీకి చెందిన విశ్రాంత తహసీల్దార్ ఎన్టీఆర్ విగ్రహం నుంచి రోడ్డు దాటుతుండగా ఇది కనిపించని ఓ వాహనాదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన అసువులు బాశారు.
- ఈ ప్రమాదాలన్నింటికీ కారణం ప్రధాన రోడ్డుపై డివైడర్లు ఎత్తుగా ఉండటం, చెట్లు పెరిగి ఉండటం కారణంగా ఒకరికి ఒకరు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లుగా స్పష్టంగా తెలుస్తుంది. దీంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ, స్టాపర్లు లేకపోవడం కూడా ప్రమాదాలు జరిగేందుకు కారణమవుతున్నాయి.

ప్రమాదాలు నివారించేందుకు సిగ్నల్ వ్యవస్థ

నల్లగొండ పట్టణంలోని ప్రధాన రహదారులపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాం. ప్రధానంగా రోడ్లు నూతనంగా ఏర్పాటు చేయడంతో వాహనదారులు ఇష్టారీతిలో ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదాల నివారణ కోసం ఇటీవల మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐలు కలిసి ప్రమాదాలు జరిగే సంఘటన స్థలాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థతో పాటు స్టాపర్లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. గుర్తించిన ప్రదేశాల్లోనే కాకుండా అవసరమైతే ఇతర ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తాం. వాహనాదారులకు ఇబ్బందికరంగా ఉండే ఎత్తుగా ఉన్న డివైడర్లను కూడా తొలగిస్తున్నాం. .



– రవి, మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్, నల్లగొండ

నేడు సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

- 11.8 అడుగులకు చేరిన ఖమ్మం జిల్లా పాలేరు జలాశయం
- తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పాలేరును నింపాలని ప్రభుత్వం నిర్ణయం

నాగార్జునసాగర్, జనవరి 30: ఖమ్మం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు పాలేరు జలాశయానికి నీటిని విడుదల చేయనున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వకు బుధవారం ఉదయం 10 గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. పాలేరు జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడానికి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పాలేరు జలాశయం నింపేందుకు ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి ఎడమకాల్వ ద్వారా రోజుకు ఐదు వేల క్యూసెక్కుల చొప్పున 10 రోజుల పాటు 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆదేశించినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. పాలేరు జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 22.5 అడుగుల కాగా ప్రస్తుతం 11.8 అడుగులుగా ఉంది. దీంతో ఖమ్మం పట్టణానికి తాగునీటి సరఫరా కష్టమవుతుంది. ఈ మేరకు పాలేరు జలాశయాన్ని నింపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కేఆర్ఎంబీ సభ్యుల పర్యవేక్షణలో నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. నీరు వృథా కాకుండా ఉండేందుకు ఎడమకాల్వ పరిధిలోని మేజర్లు, మైనర్లు, తూముల, షట్టర్ల వద్ద సిబ్బందిని కాపలా ఉంచాలని అధికారులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 520.10 అడుగులు (149.4580 టీఎంసీలు)గా నమోదైంది. సాగర్ నుంచి జంట నగరాల తాగునీటి అవసరాల నిమిత్తం ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 900 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి ఎలాంటి నీటి రాక లేదు. సాగర్ కుడి, ఎడమ, వరదకాల్వలకు ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదల లేదు.

తాగునీటి సరఫరాపై దృష్టి సారించండి

మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ రమేష్‌గౌడ్

రామగిరి, జనవరి 30: నల్లగొండ పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా నీటి సరఫరాపై అధికారులు దృష్టిసారించాలని మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వీటీ.రోడ్, శివాజీనగర్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించామని, గుంతలమయంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టామన్నారు. మంత్రి సహకారంతో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పనులు నిర్వహిస్తామన్నారు. రూ.30లక్షలతో చేపల మార్కెట్ నిర్మాణం చేపడతామని, యువత చదువుకునేందుకు మొబైల్ బస్సు స్టడీ హాల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, గతం మరిచి ఉద్యోగులంతా బాధ్యతతో పని చేయాలన్నారు. వేసవి వస్తున్నందున తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. తాగు నీటి సరఫరాలో క్రమపద్ధతి ఉండాలని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఆపరేటర్లను సస్పెండ్ చేయాలని సూచించారు. 110 వాహనాలు రోజుకో వాహనం మరమ్మతుకు వస్తోందని, కాంట్రాక్టర్ల కోసం ఈ పనులు చేస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ అభిమన్యు శ్రీనివాస్ మాట్లాడుతూ, వాహనాలకు కాంట్రాక్టర్ మరమ్మతు చేయించడం లేదని, వారం, పది రోజులు మూలన పడితే చెత్త తరలింపు నిలుస్తోందన్నారు. ఇద్దరు మెకానిక్‌లను నియమించే మునిసిపాలిటీనే సొంతంగా మరమ్మతులు చేయించాలన్నారు. వీధి లైట్లు కాంట్రాక్టర్ కూడా లైట్లు వేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ, గతంలో జరిగిన పొరపాట్లను సవరించాలని, మునిసిపాలిటీ తీర్మానం లేకుండా చేసిన పనులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కోట్ల రూపాయల పనులు మునిసిపాలిటీ తీర్మానం లేకుండా చేయడం సరికాదన్నారు. ప్లాస్టిక్, ఫ్లెక్సీలను నియంత్రించేందుకు అంతా కలిసి కఠిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సెక్షన్లలో అధికారులు దీర్ఘకాలికంగా ఉండకుండా చూడాలని కోరారు. కౌన్సిలర్ ఖయ్యుంబేగ్ మాట్లాడుతూ, కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. మాజీ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మి మాట్లాడుతూ, సావర్కర్ నగర్ ప్రాంతంలో తాగు నీటి సరఫరాలో లోపాలు ఉన్నాయని చెప్పినా సరి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రవి, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మునిసిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్

ఉదయసముద్రం కాల్వ అలైన్‌మెంట్‌ను మార్చాలి

ప్రస్తుత అలైన్‌మెంట్‌ను వ్యతిరేకించిన రైతులు


సమావేశంలో ఆర్డీవో, తహసీల్దార్‌తో మాట్లాడుతున్న భూ నిర్వాసిత రైతులు

చిట్యాలరూరల్, జనవరి 30: చిట్యాల మండలం వట్టిమర్తి శివారులో చేపట్టనున్న బి.వెల్లంల ఉదయసముద్రం కాల్వ అలైన్‌మెంట్‌ను మార్చాలని పలువురు రైతుల డిమాండ్ చేశారు. మంగళవారం రైతులతో నల్లగొండ ఆర్డీవో రవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ, తమకు నష్టం కలిగించే అలైన్‌మెంట్ వద్దని వ్యతిరేకించారు. భూములు కోల్పోనున్న తమకు పరిహారాన్ని బహిరంగ మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలని లేదంటే అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో భూముల ధరలు భారీగా ఉన్నాయని, ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇస్తేనే తాము అంగీకరిస్తామని కొందరు రైతులు తేల్చి చెప్పగా అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనని మరికొందరు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ, ఇరిగేషన్ అధికారులు, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

ఏడీఏ ఎల్లయ్య


అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రికార్డులను తనిఖీచేస్తున్న ఏడీఏ ఎల్లయ్య

మర్రిగూడ, జనవరి 30: రైతులకు సకాలంలో యూరియాతోపాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలని మునుగోడు డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని శివన్నగూడ, లెంకలపల్లి, కుదాభక్షపల్లి గ్రామాల్లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, మర్రిగూడలో మన గ్రోమోర్, శివన్నగూడెంలో ఎస్ఈఎస్, లెంకలపల్లిలో ఏపీఎస్‌కే ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఎరువలు దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలన్నారు. అంతేగాక ఎమార్పీకే ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని సూచించారు. ఎమార్పీకి మించి రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాలను సైతం సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ-పాస్ యంత్రం, రిజిస్టర్లలో ఎరువుల విక్రయాల సమాచారాన్ని ప్రతీ రోజు పొందుపర్చాలన్నారు. ఆయన వెంట ఏఈవో విజయ్‌కుమార్, ఎరువుల దుకాణాల డీలర్లు మల్లేష్, బంగారం, తదితరులు ఉన్నారు.

చిన్నారులకు బలవర్ధక బాలామృతం అందించాలి

ఐసీడీఎస్ ఆర్జేడీ మోతి

చిట్యాలరూరల్, జనవరి 30: అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదైన చిన్నారులకు తల్లిదండ్రులు బాలామృతాన్ని తినిపించాలని ఐసీడీఎస్ ఆర్జేడీ మోతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. తొలుత కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. పౌష్టికాహారాన్ని తింటున్నారా అని, చిన్నారులకు బలవర్ధక ఆహారాన్ని తినిపిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నారులకు బలవర్ధక పౌష్టికాహారాన్ని అందిస్తే భవిష్యత్‌లో ఎలాంటి అనారోగ్య సమస్యలు రావడం ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకుంటే తల్లితో పాటు పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి బాలింతలు వారి తల్లిపాలనే ఇవ్వాలని సూచించారు. చిన్నారులకు తల్లిపాలే శ్రేయస్కరమన్నారు. బిడ్డ ఎదిగే సమయంలో చిన్నప్పుడే బలమైన ఆహారాన్ని ఇస్తే ఎదుగుదలలో ఎలాంటి అవాంతరాలు ఉండవన్నారు. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా భుజించాలని, ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో కృష్ణవేణి, సీడీపీవో కవిత, లిఖిత, వెంకటమ్మ, పారిజాత, ధనలక్ష్మి, హంసమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ఏపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేస్తున్న ఆర్జేడీ మోతి

యాదాద్రిలో క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట, జనవరి 30: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనృసింహుడికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని అర్చక స్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసి సింధూరం, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. ఆంజనేయుడి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు సంప్రదాయరీతిలో కొనసాగాయి.

కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయంలో పుష్కరిణి, ప్రధానాలయంలోని, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,09,970 ఆదాయం సమకూరిందని దేవస్థాన అధికారులు తెలిపారు.


తిరువీధుల్లో లక్ష్మీనృసింహుల అలంకార జోడు సేవలను ఊరేగిస్తున్న అర్చకులు


మోత్కూరులో గోదాం వద్ద క్యూలో ఉంచిన సిలిండర్లు, ఎదురు చూస్తున్న వినియోగదారులు

వంట గ్యాస్ కోసం తిప్పలు

మోత్కూరు జనవరి 30: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. మోత్కూరు భారత్ గ్యాస్ గోదాంకు సిలిండర్ల లోడ్ వస్తుందని తెలియడంతో వినియోగదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులుకాశారు. లోడ్ లారీ(524 సిలిండర్లు) రాగానే సిలిండర్లను గోదాంలో దించకుండా, డోర్ డెలివరీ వాహనాల్లో లోడ్ చేయకుండా అడ్డుకుని లారీ నుంచే నేరుగా సిలిండర్లు తీసుకున్నారు. ఉదయం నుంచి క్యూలో నిల్చున్నా చివరన ఉన్న వారికి సిలిండర్లు అందక ఖాళీ సిలిండర్ తీసుకొని వెళ్లిపోయారు.



కాపర్‌వైర్ చోరీ ముఠా అరెస్టు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 30: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరును కాజేసే దొంగల ముఠాను నల్లగొండజిల్లా మిర్యాలగూడ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటగిరి కేసు వివరాలు వెల్లడించారు. నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన కుంచం కోటేష్, రూపాని గోపి, కూసాని నాగయ్య, వరికుప్పల శ్రీను, వరుసు నాగరాజు, కుంచం విజయ్ ముఠాగా ఏర్పడి డివిజన్‌లోని ఏడు చోరీలకు పాల్పడ్డారు. ఇప్పటివరకు మిర్యాలగూడ, వేములపల్లి, త్రిపురారం, నేలకొండపల్లితో కలిపి మొత్తం ఏడు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి దొంగిలించిన కాపర్‌వైర్‌ను వెంటనే విక్రయిస్తే పట్టుబడుతామన్న భయంతో రహస్యంగా దాచిపెట్టారు. అందులో కొంత వైరును మిర్యాలగూడ పట్టణంలో విక్రయించేందుకు నిందితులు రెండు ద్విచక్రవాహనాలపై వస్తూ వాహన తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను అంగీకరించారు. వారి నుంచి రూ.3లక్షల విలువైన 305కిలోల కాపర్‌వైర్, మూడు ద్విచక్రవాహనాలు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. దొంగల ముఠా గుట్టురట్టు చేసేందుకు డీఎస్పీ ఆధ్వర్యంలో పనిచేసిన బృందంలోని టూటౌన్ సీఐ నర్సింహారావు, ఎస్‌ఐలు కృష్ణయ్య, రాంబాబు, విజయ్‌కుమార్, వీరశేఖర్, హెచ్‌సీ వెంకటేశ్వర్లు, పీసీలు రవి, నరేష్‌కుమార్, అక్బర్, రామకృష్ణలను ఎస్పీ చందనదీప్తి అభినందించారు.

సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి



హైదరాబాద్‌లో డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దేవరకొండ, జనవరి 30: యాదాద్రిభువనగిరి జడ్పీ ఛైర్మన్ సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీపై అడిగితే ఓపికతో సమాధానం చెప్పాల్సిన మంత్రి సహనం కోల్పోయి మాట్లాడడం సరికాదన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలు అమలు చేయాలని అడిగిన ప్రతిపక్ష పార్టీలతో మాట్లాడే వ్యవహారశైలి సరికాదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు టీవీఎన్ రెడ్డి, హనుమంతు వెంకటేష్‌గౌడ్, సుభాష్, గాజుల ఆంజనేయులు, రాజేష్, అనంతగిరి, ప్రతాప్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మల్లారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

సూర్యాపేట(కలెక్టరేట్): మంత్రి వెంకటరెడ్డి వీధి రౌడీలా ప్రవర్తిస్తూ బీఆర్‌ఎస్ నాయకులను అవమానించి, దాడులకు ఉసిగొల్పుతున్నారని బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించినందుకు భువనగిరి జడ్పీ ఛైర్మన్ సందీప్‌రెడ్డిపై దాడి చేయించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులతో ఏకమై గూండాయిజం చేయడం తగదన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే దాడి చేస్తారా అని జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, ఉప్పల ఆనంద్, కోడి సైదులుయాదవ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: జడ్పీ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జడ్పీఛైర్మన్‌ను అవమానించే విధంగా మంత్రి మాట్లాడడం తగదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు డిల్లీ మాధవరెడ్డి, ముప్పిడి శ్రీనివాస్, బొడిగే ఆనంద్, మల్లేశ్ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: యాదాద్రి జడ్పీఛైర్మన్ సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై మాట్లాడే నైతిక హక్కు మంత్రి కోమటిరెడ్డికి లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు నోముల శంకర్‌యాదవ్, బాషబోయిన లింగస్వామి, క్రాంతి కుమార్, గంట కిరణ్, గణేష్, శ్రీకాంత్, నానియాదవ్, శివకుమార్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: ప్రభుత్వ కార్యక్రమంలో జడ్పీఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనలో పక్షపాత ధోరణితో వ్యవహరించిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ రవిగుప్తాకు బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధుల బృందం మంగళవారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగంపై ప్రశ్నిస్తున్న జడ్పీఛైర్మన్‌పై స్థానిక పోలీస్ అధికారులు దురుసుగా వ్యవహరించడం సరికాదన్నారు. విచారణ చేపట్టి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జడ్పీ ఛైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి గుజ్జ దీపిక, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లబోతు భాస్కర్‌రావు శానంపూడి సైదిరెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి ఉన్నారు. అహంకార పూరితంగా వ్యవహరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని యాదాద్రిభువనగిరి జడ్పీ వైస్‌ఛైర్మన్ ధనావత్ భీకునాయక్ డిమాండ్ చేశారు. జడ్పీ కార్యాలయంలో భువనగిరి, యాదగిరిగుట్ట, రాజాపేట జడ్పీటీసీలు సుబ్బూరు బీరు మల్లయ్య, తోటకూరి అనురాధ, చామకూర గోపాల్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడువక ముందే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దురుసుగా వ్యవహరించడం సరికాదన్నారు. మంత్రికి సమాన హోదా కలిగిన జడ్పీ ఛైర్మన్‌ను అవమాన పర్చడం సరికాదన్నారు.

బొమ్మలరామారం: మంత్రి వెంకట్‌రెడ్డి జడ్పీ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని కించపరిచే వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండల నాయకులు అన్నారు. జడ్పీఛైర్మన్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండలకేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సందీప్‌రెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోలగోని వెంకటేష్‌గౌడ్, ఎంపీపీ సుధీర్‌రెడ్డి, గూడె బాలనర్సింహ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: జడ్పీ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దూషించడం సరికాదని ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. అహంకార పూరితంగా వ్యవహరిస్తే ప్రజలే తిరగబడతారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, కోట మల్లారెడ్డి, కందాడి భూపాల్‌రెడ్డి, బత్తుల మాధవి శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని విమర్శించడం తగదు : బీర్ల



బొమ్మలరామారంలో సందీప్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుర్కపల్లి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై మాజీమంత్రి జగదీష్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ సందీప్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన నాయకుడిని ఇష్టారాజ్యంగా విమర్శించడం సిగ్గుచేటని, మాజీమంత్రికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బొమ్మలరామారం: జడ్పీ ఛైర్మన్‌గా ఉంటూ సొంత గ్రామానికి రోడ్డు కూడా వేయలేని సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో జడ్పీఛైర్మన్ సందీప్‌రెడ్డి దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. సొంత గ్రామం వడపర్తి నుంచి చీకటిమామిడి వరకు డబుల్ రోడ్డు వేస్తానని హామీ ఇచ్చి నెర వేర్చలేని సందీప్‌రెడ్డి మంత్రిపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మర్రి భగవంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, దేశెట్టి చంద్రశేఖర్, రఘు, బానసమ్ బాబు, కుమార్, మహేష్‌గౌడ్, యాదయ్య, హేమంత్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ఆరుగురిని బలితీసుకున్న లారీ సీజ్

మిర్యాలగూడ అర్బన్, జనవరి 30: రెండు కుంటుంబాలకు చెందిన ఆరుగురిని బలిదీసుకున్న లారీని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు మంగళవారం సీజ్‌చేసి డ్రైవర్‌ను అరెస్టుచేశారు. ఈ నెల 28వ తేదీ అర్ధరాత్రి అద్దంకి- నార్కట్‌పల్లిరోడ్డుపై మిర్యాలగూడ వద్ద కారును ఏపీ రాష్టం వైపు వెళ్తున్న పొట్టులారీ ఢీ కొట్టిన సంఘటనలో ఆరుగురు మృతిచెందిన సంఘటన విదితమే. ప్రమాదం జరిగిన తరువాత పోలీసులకు చిక్కకుండా లారీని డ్రైవర్ ఏపీ రాష్ట్రంలోకి ప్రవేశించాడు. దీంతో ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించేందుకు సీసీకెమెరాల పుటేజీలు కీలకంగా మారాయి. పుటేజీల ఆధారంగా పరారీలో ఉన్న లారీని అద్దంకి వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కేసునమోదు చేశారు. కాగా పోలీసులు సీజ్ చేసినలారీని డీఎస్పీ వెంకటగిరి పరిశీలించారు. లారీ ముందు భాగంలో దళసరి ఐరన్‌బంపర్ కారును ఈడ్చుకెళ్లడంతో ప్రమాద తీవ్రత పెరిగినట్లు నిర్ధారించారు. లారీని వెంబడించి పట్టుకున్న ఎస్‌ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీస్ బృందాన్ని ఆయన అభినందించారు.

పొగమంచులో లైట్ల వెళుతురులో వెలుతున్న వాహనాలు





రహదారి పక్కన దట్టమైన పొగమంచు కారణంగా కనిపించని చెట్లు

కప్పేసిన మంచుదుప్పటి

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిని మంగళవారం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 9గంటల సమయంలోనూ జాతీయ రహదారిపై దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో లైట్ల వెలుతురులో నెమ్మదిగా ముందుకు సాగారు. కొందరు వాహనాలను రోడ్డు పక్కకు ఆపి పొగమంచు తగ్గాక బయలుదేరారు. ఉదయపు నడకకు వెళ్లేవారు సైతం మంచు తగ్గుముఖం పట్టాక బయటకు వచ్చారు. కనువిందు చేసిన మంచు దృశ్యాలను ప్రకృతి ప్రేమికులు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

● చిట్యాలరూరల్.

నల్లగొండను ఎండబెడతారా..? : జూలకంటి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జనవరి 30: ఇతర జిల్లాలకు సాగర్ నీరు వీడుదల చేసి నల్లగొండను ఎండబెడతారా అని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు తాగునీరు, ఖమ్మం జిల్లా పాలేరుకు ఎడమకాల్వ ద్వారా నీరు విడుదల చేసేందుకు చర్యలు చేపడుతూ ప్రాజెక్టు ఉన్న నల్లగొండ జిల్లాను ఎండబెట్టడం సరికాదన్నారు. నల్లగొండ జిల్లా ప్రజలకు సాగునీటి, తాగునీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా మంత్రులపై ఉందన్నారు. ఎస్‌ఎల్‌బీసీ కింద నల్లగొండ, నకిరేకల్ ఎడమకాల్వకింద నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతులు బోరుబావుల కింద సాగుచేసిన వరి పొలాలు పొట్టదశలో నీరు లేక ఎండిపోతున్నాయన్నారు. పంటను రక్షించుకోకుంటే రైస్‌మిల్లులు మూతపడే ప్రమాదం ఉందన్నారు. బియ్యం ధరలు పెరిగి సామాన్యులకు భారంగా మారుతోందన్నారు. గతంలో సాగర్ నీటిమట్టం 505అడుగులు ఉన్నప్పుడు కూడా ఎడమకాల్వకు నీరు విడుదల చేసి చెరువులు కుంటలు నింపిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం 520అడుగులు ప్రాజెక్టులో నీరు ఉన్నందున పది రోజులపాటు సాగర్ ఎడమకాల్వకు, ఎస్‌ఎల్‌బీసీ, వరదకాల్వలకు నీరు విడుదల చేసి చెరువులను, కుంటలను నీటితో నింపాలన్నారు. పలు చోట్ల మిషన్‌భగీరథ నీరందక ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడుతుందన్నారు. ఎడమకాల్వ ద్వారా చెరువులను నింపితే భూగర్భజలాలు పెరిగి బోరుబావుల కింద సాగు చేసిన పొలాలను రక్షించవచ్చునని అన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి చర్చించినట్లు తెలిపారు. ఎడమకాల్వపై నున్న మేజర్, మైనర్ కాల్వల తూముల వద్ద అధికారులను కాపలాఉంచి ఖమ్మం జిల్లా పాలేరుకు తరలిస్తామనడం సరికాదన్నారు. నల్లగొండ జిల్లాలోని చెరువులను సాగర్ నీటిద్వారా నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న సాగర్‌లోని ప్రాజెక్టు సీఈ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు జిల్లా వ్యాప్తంగా రైతులు కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతి రాంమూర్తి, జగదీశ్‌చంద్ర, రాగిరెడ్డి మంగారెడ్డి, భావాండ్ల పాండు, వినోద్ నాయక్, పరుశరాములు, పగిడోజు రాంమూర్తి, పాపానాయక్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చిట్యాలరూరల్, నార్కట్‌పల్లి, జనవరి 30: నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామానికి చెందిన కిన్నెర బక్కయ్య, పూలమ్మ దంపతుల కుమారుడు కిన్నెర మధు(35) మరొకరితో కలిసి ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై వెళుతున్నారు. పెద్దకాపర్తి శివారులో 7మిడ్‌వే హోటల్ ఎదురుగా ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. దీంతో మధుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బద్రికి తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు. కనగల్ మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన ఇటివాల శ్రీను, భార్య కళమ్మ(37) ఈ నెల 29న చెర్వుగట్టుకు వచ్చి శ్రీపార్వతీదేవి ఆలయ ఆవరణ సమీపంలో నిద్రించారు. హైదరాబాద్‌కు చెందిన ఏపీ 29వి9122 నంబరుగల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును డ్రైవర్ అబ్దుల్ అజాగ్రత్తగా నడిపి నిద్రిస్తున్న కళమ్మ పైనుంచి వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. కళమ్మ భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

ఆశ కార్యకర్త ఆత్మాహత్యాయత్నం



ఆశ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నిడమనూరు, జనవరి 30: కాంగ్రెస్ పార్టీ నాయకుడు తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ ఆశ కార్యకర్త ఎమ్మెల్యే సమక్షంలో ఆత్మాహత్యాయత్నం చేసింది. మంగళవారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని పార్వతీపురంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం గ్రామస్థులు ఇటీవల విషజ్వరాల బారిన పడడంతో గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధికారులు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. అదే సమ యంలో గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త సంకూరి వెంకటలక్ష్మి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ సమావేశంలోనే బ్లేడుతో ఎడమ చేతి ముంజేయి భాగంలో కోసుకుంది. ఈ చర్యతో ఒక్కసారిగా సమీక్షలో అలజడి రేగింది. వైద్య సిబ్బంది వెంటనే ఆమెకు చికిత్స చేసి ఇంటికి పంపారు. త్రిపురారంలో సమావేశం ఉండ డంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆశ కార్యకర్త నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆత్మాహత్యాయత్నానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు తనను ఇబ్బందులు పెడుతూ, తనపై తరచూ అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నందుకే ఆత్మాహత్యాయత్నం చేసినట్లు ఆమె ఆరోపించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నేత అంకతి సత్యం వివరణ ఇస్తూ ఆశ కార్యకర్తను తాను ఎప్పుడూ ఇబ్బందులు పెట్టలేదని, గ్రామంలో విషజ్వరాలు ఉన్నందున నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించానని చెప్పారు. ఆశ కార్యకర్త చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు.

చందంపేటను ఆదర్శంగా అభివృద్ధి చేస్తా : బాలునాయక్



చందంపేట సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, జనవరి 30: మండలాన్ని చందంపేట అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా మార్చుతానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీ వో కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న వేస వి దృష్టిలో పెట్టుకుని తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మండల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంపీపీ పార్వతిచందునాయక్, పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ ప్రేమలత, జడ్పీటీసీ బుజ్జీలచ్చిరాం, ఎంపీడీవో రాములునాయక్, తహసీల్దార్ శ్రీరాములు, కోఆప్షన్ సాధిక్, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● **పెద్దఅడిశర్లపల్లి:** కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. అంగడిపేట గ్రామానికి చెందిన దండుగుల సైదులు ఇటీవల మృతిచెందాడు. పార్టీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా మంజూరైంది. మంగళవారం మృతుడి భార్య, కుటుంబసభ్యులకు రూ.2లక్షల బీమా చెక్కును ఆయన అందజేశారు. మృతుని కుమార్తె ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతుండటంతో ఆమె చదువుకోసం రూ.50 వేలు సొంతంగా ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : వీరేశం

కట్టంగూరు, చిట్యాలరూరల్, జనవరి 30: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పందెనపల్లి, ఈదులూరు, మునుకుంట్ల, పరడ, అయిటిపాముల, కట్టంగూరు, ముత్యాలమ్మ, ఇస్మాయిల్‌పల్లి గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. చిట్యాల మండలంలోని వట్టిమర్తి, వనిపాకల, వేంబావి, తాళ్లవెల్లంల, బోయగుబ్బ గ్రామాల్లో ఎమ్మెల్యే వీరేశం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, నాయకులు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, పెద్ది యాదగిరి, ఎంపీటీసీలు, సర్పంచులు వల్లపు నాగలక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, చింత వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి : ఎమ్మెల్యే సామేల్



పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, జనవరి 30: విద్యతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని భైరవునిబండ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్మించిన ప్రహరీ, తరగతి గదులు, వంట గదులను ప్రారంభించారు. ఆకారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యమిస్తుందని అన్నారు. ఆసీనహార్ కాల్వకు రూ.1.25లక్షలు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ ఎర్ర రణీలయాదగిరి, భైరవునిబండ సర్పంచ్ దండ రేణుకఅశోక్‌రెడ్డి, ఆకారం సర్పంచ్, ఎంపీటీసీలు కందాల సమరంరెడ్డి, వలిశెట్టి చంద్రకళ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, తహసీల్దార్ బీపాల్‌సింగ్, ఎంపీవో సుధాకర్, ఎంఈవో నాగయ్య, పీఆర్ఏఈ భరత్‌చంద్ర, నాయకులు నరేందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జనార్దన్, పరమేష్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

దేవరకొండ, జనవరి 30: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాలలో మంగళవారం నూతన జాతీయ విద్యావిధానం 2020ని రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయికరణ చేయడానికి కుట్ర పన్నుతుందని విమర్శించారు. నాణ్యమైన విద్యను పొందే హక్కును కేంద్రం కుట్రతో కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శావుద్దీన్, నాయకులు శివకుమార్, సైదులు, కార్తీక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయసాధనకు కృషి చేయాలి

- జిల్లాలో మహాత్మాగాంధీ వర్ధంతి
- నివాళులర్పించిన నాయకులు
- ఆయన సేవలను కొనియాడిన నాయకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

జాతిపిత మహాత్మాగాంధీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లాలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గాంధీ విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. గాంధేయమార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగ ఫలితమే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ జీవిస్తున్నామన్నారు. దేశస్వాతంత్రం కోసం గాంధీ అందరినీ ఒక్కటిగా సంఘటితం చేశారని, ఆయనతో అందరూ కలిసి స్వాతంత్రాన్ని తీసుకురావడంతో కీలకభూమిక పోషించారని అన్నారు. వారి త్యాగాలను



మిర్యాలగూడలో మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



నల్లగొండ ఎస్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పోలీసులు

భావితరాలకు తెలియజేయాలని సూచించారు.

● నల్లగొండ పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విఠల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఏవో శ్రీనివాసులు, సీఐలు సూర్య నాయక్, శ్రీను, ఆర్ఐలు సంతోష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అంతేకాకుండా జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీభవన్‌లో, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్ యామా కవిత దయాకర్, అదనపు ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి శ్రీనివాస్, నాయకులు బండారు వెంకటేశ్వర్లు, కోటగిరి రామకృష్ణ, విరెల్లి సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సురెడ్డి సరస్వతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● గాంధేయ మార్గంలో పయనించాలని ఎమ్మెల్యే బీఎల్ఆర్ అన్నారు. మిర్యాలగూడలో మహాత్మాగాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, బెజ్జం సాయి, తిరునగరు నాగలక్ష్మి, భవాని, లీలారాణి, లక్ష్మి పాల్గొన్నారు.

● చింతపల్లి, వేములపల్లి, నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, మాలి కాంతారెడ్డి, ఎంపీపీ కొండూరు భవానిపవన్‌కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, బత్తుల ఊషయ్య, దూదిమెట్ల సత్తయ్య, భిక్షమయ్య, వాసుదేవ్, కోటయ్య, జనార్ధన్, సత్తయ్య, భరత్, భిక్షపతి, సమద్, అజీజ్ పాల్గొన్నారు.



నల్లగొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



చింతపల్లి: కుర్మేడులో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కుందూరు జయవీర్‌రెడ్డి

● ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

నిడమనూరు, జనవరి 30: గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పార్వతీపురంలో విషజ్వరాలపై మంగళవారం అధికారులు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. విషజ్వరాలు వ్యాపించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం లోపించడంతో పాటు కాల్వల్లో నీరు నిల్వ ఉన్నందున లార్వా వ్యాప్తి చెంది జ్వరాలు వచ్చాయని అధికారులు తెలిపారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని వీధులన్నీ పర్యటించి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వెంటనే ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కేశ రవి, వైద్యాధికారి మాధవ్‌కుమార్, ఎంపీడీవో ప్రమోద్‌కుమార్, రామేశ్వరి, అంకతి సత్యం, రంగశాయిరెడ్డి, వెంకటరమణ, వెంకట్‌రాహుల్, వల్లభ్‌రెడ్డి, శ్రీను, చినవీరయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, నర్సింగ్ విజయ్‌కుమార్, వంశీ, కృష్ణవివేక్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

మాడ్గులపల్లి: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గారకుంటపాలెం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, ప్రస్తుతం రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, ఫిబ్రవరిలో మరో రెండింటిని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నలగడ్డ విజయశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, పీఆర్ ఏఈ నరేష్, అధికారులు పాల్గొన్నారు.

అమ్మాయిలకు చదువే ఆయుధం

మర్రిగూడ, జనవరి 30: అమ్మాయిలకు చదువే ఆయుధం అవ్వాలని ఐసీడీఎస్ సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శివన్నగూడెం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళ సాధికారత చదువుతోనే సాధ్యమవుతుందని అన్నారు. లింగ వివక్ష, బాల్య వివాహాలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, అక్రమరవాణా తదితర సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ ఉండాలన్నారు. విద్యార్థులు బాల్య వివాహాలను గ్రామంలో నిర్మూలించే విధంగా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, హెచ్ఎం లింగయ్య, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, చిట్యాల సువర్ణ, అనసూయ, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి: బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ అన్నారు. మండలంలోని తీదేడులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేయవద్దని, విద్యార్థినులను చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, వెంకటమ్మ, స్వప్న, ఉన్నత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శివన్నగూడెంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మిర్యాలగూడటౌన్, జనవరి 30: విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐలు రామకృష్ణ, పర్వీన్ అన్నారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్ట్‌కు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో అధికశాతం ఉన్న యువతను గంజాయి పట్టి పీడిస్తుందన్నారు. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడటం దురదృష్టకరమన్నారు. పర్వీన్ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం ఎంత ముఖ్యమో ఆటలు, పాటలు అంతే అవసరమన్నారు. స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడకుండా చదువుపై దృష్టి సారించాలని, ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల పండుగ సందర్భంగా పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్, వైస్ ప్రిన్సిపాల్ జీస్సీ, వినోద్ చంద్రన్, రవికుమార్, శంకర్‌బాబు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్‌లో లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు

నార్కట్‌పల్లిలో సమ్మక్క సారక్క జాతర ప్రారంభం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, జనవరి 30: నార్కట్‌పల్లి మండల కేంద్రంలో స్ఫూర్తి కాలేజీ పక్కన గురి జ అశోక్‌స్వామి ఆధ్వర్యంలో సమక్క సారక్క జాతరను మంగళవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరలో మంగళవారం ఉదయం 11 గంటలకు పుట్ట బంగారం, రాత్రి 9 గంటలకు గంగతెప్ప కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా బుధవారం ఉదయం 6 గంటలకు రేణుక ఎల్లమ్మ కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు సమక్క సారక్క గంగస్నానం, సాయంత్రం 6 గంటలకు ఎదురులంక నుంచి గద్దెల వరకు అమ్మవార్లను తీసుకువస్తారు. 9.30 గంటలకు ఎత్తుల బంగారం కార్యక్రమం, 10.30కు సమ్మక్క సారక్కలకు నలుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు. గురువారం ఉదయం 10 గంటలకు ఒడిబియ్యం కార్యక్రమంతో జాతర ముగుస్తుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు అశోక్‌స్వామి తెలిపారు.

తిప్పర్తిని ఆదర్శమండలంగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రాంరెడ్డి

తిప్పర్తి, జనవరి 30: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో తిప్పర్తిని ఆదర్శ మండలంగా అభివృద్ధి చెందుతుందని జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడాల, యాపలగూడెం, వెంకటాద్రిపాలెం, ఎర్రగడ్డగూడెం, సోమోరిగూడెం గ్రామాల్లో మంగళవారం ఎంపీపీ విజయలక్ష్మితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సర్వారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సబ్‌సెంటర్, గడ్డికొండారంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సాగునీరు అందించే డి 39, డి 40 కాల్వలను పూర్తిస్థాయిలో లైనింగ్‌తో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న పనులను గుర్తించి మంత్రి సహకారంతో పరిష్కరిస్తానని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, నాయకులు, సర్పంచులు ముత్తినేని శ్యాంసుందర్, జూకూరి రమేష్, రొట్టెల రమేష్, కోన రజిత వెంకన్న, ప్రవీణ్‌కుమార్, నాగారాణిఅంబేద్కర్, సతీష్‌రెడ్డి, శివశంకర్, పిచ్చిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, డి.సౌజన్య, అనూష, సిరివెన్నెల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

మర్రిగూడ, కేతేపల్లి, జనవరి 30: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రులైన వారు ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్లు బక్క శ్రీనివాస్, మదుసూదన్‌రెడ్డి అన్నారు. ఆయా మండల కేంద్రాల్లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ పూర్తి చేసి పట్టా పొందిన వారు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్, తహసీల్దార్ కార్యాలయంలో కానీ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 728 మంది పట్టభద్రులు ఓటును నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేతేపల్లిలో సోమవారం సాయంత్రం వరకు 534 దరఖాస్తులు కాగా అందులో 203 వరకు ఆమోదించామని, మిగిలినవి పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో డీటీలు తారకరామన్, దివ్య, ఆర్ఐ బషీర్, ఎస్ఐ శ్రీనివాస్, పాండురంగారెడ్డి తదితరులు ఉన్నారు.

మంగళగౌరిదేవిగా ఎల్లమ్మ

కనగల్, జనవరి 30: మండలంలోని దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ తల్లి మంగళవారం భక్తులకు మంగళగౌరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోన నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయసిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సంక్షిప్త సమాచారం...

కట్టంగూరు: కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 384లోని తన సొంత భూమిలో ఉన్న తాటి చెట్లను అక్రమంగా నరికిన అంబటివాగుకు చెందిన రంగారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కట్టంగూరుకు చెందిన రైతులు పోగుల విమలమ్మ, పోగుల నరేందర్ కోరారు. గత నెల 27వ తేదీన తమ భూమిలో ఉన్న 50 తాటి చెట్లను అక్రమంగా నరికాడని, ఈ విషయమై నకిరేకల్ సీఐకి ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటి వరకు తాటి చెట్లు నరికిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.

మిర్యాలగూడటౌన్: పట్టణంలోని ఆదిత్య ఉన్నత పాఠశాల విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో జిల్లాస్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు కె.గణేష్‌రెడ్డి, పి.చరణ్‌తేజ, సిరిచందన అత్యుత్తమ ప్రతిభచాటి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కట్టా అనిత, బంటు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● దశరథ మెమోరియల్ టాలెంట్ టెస్ట్‌లో శ్రీసాయి టెక్నో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ కందాల శ్రీనివాసచారి తెలిపారు. నాగేందర్, చరణ్‌రెడ్డి, అశోక్ తదితరులు టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీల్లో రాణించడం హర్షనీయమన్నారు.

దామరచర్ల: మండలంలోని రాజగట్టు పునరావాస కేంద్రంలోని భూములపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలను వెలికితీయాలని గ్రామస్థులు మంత్రి వెంకట్‌రెడ్డి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ముంపునకు గురైన తమకు రాజగట్టు శివారులోని సర్వే నెం.826లో భూములు కేటాయించారు. ఆ భూముల్లో కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని గ్రామస్థులు గజ్జల వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి తదితరులు కోరారు.

హాలియా: శ్రీశ్రీశ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతికి సంబంధించిన నూతన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డికి గిరిజన సంఘం నాయకులు రమావత్ నాగేంద్రనాయక్, రమావత్ సర్ధార్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న అఖిల భారత బంజారా సేవా సంఘం బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘంగా మారిందని విమర్శించారు. ఫిబ్రవరిలో నిర్వహించే జయంతి కోసం ప్రజా సంఘాల సమక్షంలో ఉత్సవకమిటీని ఏర్పాటు చేయాలని కోరారు.

మునుగోడు: నియోజకవర్గంలో బుధవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పర్యటించనున్నారు. మర్రిగూడెం, చండూరు, చౌటుప్పల్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

డిండి: మండలంలోని చెర్కుపల్లి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న రాత్లావత్ రాము గణితంలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడు. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన గణిత ప్రతిభ పరీక్షలో జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం రాంరెడ్డి తెలిపారు. ఈ నెల 31 న నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి గణిత ప్రతిభ పోటీల్లో రాము పాల్గొననున్నాడు.

కేతేపల్లి: కేతేపల్లి ఎస్ఐగా శివతేజ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు పరిరక్షించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

వేములపల్లి: సాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 2వ తేదీన నాగార్జునసాగర్ ఎస్ఈ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి పాల్వాయి రాంరెడ్డి కోరారు. తాగునీటి కోసం పాలేరు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని రైతుల సాగునీటి కష్టాలు తొలగించకపోవడం బాధాకరమన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా రైతుల గోస పట్టకపోవడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. ఆయకట్టు కింది పొలాలను కాపాడేందుకు నీటి విడుదల చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకుడు రొండి శ్రీనివాస్, కోడిరెక్క వెంకన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: వీఆర్ఏల వారసులకు వారసత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతూ వీఆర్ఏలు అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏల వారసులకు వారి విద్యార్హత ఆధారంగా వారసత్వ ఉద్యోగాలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసినా ఇప్పటి వరకు నియామక ఉత్తర్వులు చేపట్టలేదని పేర్కొన్నారు.

చండూరురూరల్: మండలంలో ఉన్నటువంటి అన్ని రైతు వేదికలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్ నాయకుల చిత్రాలను, చిత్రపటాలను తొలగించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ నాయకుల చిత్రాలను, చిత్రపటాలను ఏర్పాటు చేయాలని చండూరు ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ కట్ట బిక్షం అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా గ్రామాల్లో గత ప్రభుత్వానికి చెందిన వారి చిత్రపటాలు ఉన్నాయని అన్నారు. వెంటనే వాటిని మార్చి కాంగ్రెస్ నాయకుల చిత్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా చింత యాదగిరి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు కందిమళ్ల కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి కొడదల శంకర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవఅధ్యక్షుడిగా గురిజాల నరేందర్, అధ్యక్ష, కార్యదర్శులుగా చింత యాదగిరి, జూలకంటి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సహాయకార్యదర్శి చెరుపల్లి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

మిర్యాలగూడ రూరల్: కేంద్రంలోని బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని సామాజిక కార్యకర్త డాక్టర్ రాజు అన్నారు. దేశంలో భిన్న కులాలు, మతాలు, సంస్కృతులు ఉన్నాయని, ప్రభుత్వం అందరినీ సమానంగా చూడాలని ఆయన అన్నారు.